క్లుప్తంగా

నేడు స్వామివారి కల్యాణం

రేగొండ: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా నేడు (శుక్రవారం) స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మహేశ్, చైర్మన్ ముల్కనూరి భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి కమిటీ ఏర్పాటు

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అమ్మ ఆదర్శ కళాశాల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, కన్వీనర్‌గా కళాశాల ప్రిన్సిపాల్ విజయాదేవి, కమిటీ మెంబర్ చైర్‌పర్సన్‌గా చీగిరి మీనా, సభ్యులుగా కళాశాల అధ్యాపకులు నరేందర్, రవీందర్, వెంకట్ రెడ్డిలను, విద్యార్థుల తల్లిదండ్రులు రాగం రమేష్, రామిడి శ్రీనివాస్, దేవరకొండ వెంకటేష్, చీగిరి సది, తోకల సుధాకర్, జగన్నాథ్, సురేష్‌లను నియమించారు.

సన్మానం


సన్మానిస్తున్న సిబ్బంది

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎంగా పనిచేస్తున్న అంబాల రవివర్మ జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించి రవివర్మను ఘనంగా సన్మానించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, కార్యదర్శి సునీత, కోశాధికారి శిరీష, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ నవీన్, ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రఫీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తక్కలపల్లి రాజు, శ్రీనివాస్, సీసీలు బాబురావు, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండలంలోని గంగారం మోడల్ కళాశాలలో ఇంటర్మీడియేట్‌లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా భర్తీ చేయుటకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని ఈ నెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలికలకు హాస్టల్ వసతి ఉన్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రోడ్లపై పశువులను వదిలితే చర్యలు

కాళేశ్వరం : రోడ్లపై పశువులు వదిలితే కఠిన చర్యలు తప్పవని మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యజమానులు తమ పశువులను వదలడంతో రాత్రివేళలో రోడ్లపై పడుకోవడం వల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారని, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నోటీసు ఇచ్చినట్లు పశువులు రోడ్లపై రాకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లేనిచో గ్రామ పంచాయతీ, పోలీసుల సమన్వయంతో యజమానులకు జరిమానా విధించడమే కాకుండా పశువులను గోశాలకు తరలిస్తామని ఎస్సై హెచ్చరించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం..

- తరచూ విద్యుత్ ప్రమాదాలు
- జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


తాడిచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది(ఫైల్)

మల్హర్: విద్యుత్ ప్రమాదాలతో ప్రజలు, రైతులు, మూగ జీవాల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి. వర్షాల పడుతున్న సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. గాలివానకు విద్యుత్ స్తంభాలు విరిగిపడడం, విద్యుత్ వైర్లు తెగిపడడం, తీగలు కిందకు వాలిపోవడంతో విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. మండలంలోని తాడిచర్ల గ్రామంలో ఈనెల 18న ఓదేలు అనే రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఇలా మండలంలో నిత్యం విద్యుదాఘాతంతో ప్రజలు, మూగజీవాలు మృతి చెందుతున్నాయి. ప్రమాదాల నివారణకు ప్రజలు పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదు.
- విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దు.
- ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో తాకొద్దు.
- ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదు.
- గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను తాకొద్దు.
- మోటార్ల వద్ద స్టార్టర్లను చెక్క బాక్సులో ఎత్తుగా ఏర్పాటు చేసుకోవాలి.
- వర్షానికి స్టాటర్లు తడవకుండా, పోడి ప్రదేశంలో మాత్రమే ఉంచాలి.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్టార్లర్లు చుట్టూ పిచ్చిమొక్కలు పొదలు ఉంటే తొలగించాలి.
- విద్యుత్ సమస్యలు ఉంటే సంబంధిత సిబ్బందికి తెలియజేయాలి.

జాగ్రత్తలు పాటించాలి



“ వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ స్తంభాలు కూలడం, విద్యుత్ తీగలు తెగి పడడం వంటివి జరిగితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలి.

– శేఖర్, విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ ఏఈ, మల్హర్

గుడిసె లేని గ్రామాలే లక్ష్యం


ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోస్తున్న నాయకులు

టేకుమట్ల : రాష్ట్ర వ్యాప్తంగా గుడిసె లేని గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపల్లి వీరేశం అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని రామకృష్ణాపూర్ (వి) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అంకిత భావంతో పని చేస్తున్నారని తెలిపారు. పేదల కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి వారి అభివృద్ధికి దోహదపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడ్ల రమేష్, నాయకులు రామారావు, లద్దునూరి ఐలయ్య, కుంభం రమేశ్ పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

- వైద్యాధికారి జ్యోతి


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి జ్యోతి

వెంకటాపురం(కె): కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. గురువారం మండల పరిధిలోని తోగుబోరు, వెంకటాపురం, ముత్తారం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. వైద్యాధికారులు ఆశీష్, డీపీఎంఓ సత్యనారాయణ, సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఏటూరునాగారం: మండల కేంద్రంలో నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లోని 180 మంది విద్యార్థులకు బ్యాక్ టు స్కూల్ విత్ స్మైల్ లో భాగంగా ఫినిక్స్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిక్స్ సొసైటీ ప్రెసిడెంట్ జీతు జాన్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో బలాన్ని చేకూరుస్తుందన్నారు. సభ్యులు పవన్ కుమార్, ఆశీష్ కమల్, దానం సతీష్ తదితరులు ఉన్నారు.

గ్యాస్ సిలిండర్ల సీజ్

మంగపేట : మండలంలోని రాజుపేటలో ములుగు, ఏటూరునాగారం సివిల్ సప్లయిస్ డీటీ రామ్‌చందర్, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. కమర్షియల్ గ్యాస్‌కు బదులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న పలు హోటళ్లతో పాటు నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసి 12 సిలిండర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వారు తెలిపారు. స్వాధీనం చేసుకున్న డొమెస్టిక్ సిలిండర్లను హోటళ్లకు ఎవరూ సరఫరా చేశారనే విషయంపై విచారించి డీలర్లతో పాటు హోటళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కాంప్లెక్స్ సమావేశం


మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌బాబు

మల్హర్: మండలంలోని వల్లెకుంట జిల్లా పరిషత్‌పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సుదర్శనం, ఎంఈఓ లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో కాటారం సబ్ డివిజన్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరిని పెంపొందించి, అంశాల వారీగా అభ్యసన సామర్థ్యాలపై సాధించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ రమేష్‌నాయక్, ఫిజికల్ సైన్స్ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గండు రాజబాబు, రిసోర్స్ పర్సన్స్ భజన్ నాయక్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మడక మధు, రాజు నాయక్ కుమారస్వామి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వాజేడు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని పల్లె దవాఖాన వైద్యాధికారి గ్యానస అన్నారు. మండల పరిధిలోని జంగాలపల్లిలోని బాలికల మినీ గురుకులాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వంట గది, మిల్లర్ వాటర్ రూమ్, విద్యార్థుల విశ్రాంత గది పరిశీలించారు. వంటలను పరిశీలించిన ఆమె విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆమె వెంట కోటిరెడ్డి, మహేంద్ర, సుజాత ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- తహసీల్దార్ నాగరాజు


వంట సామగ్రి పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కాటారం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను గురువారం నాగరాజు తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంట గది, డైనింగ్ హాల్‌లో పరిశుభ్రతను పరిశీలించారు. వంట సామగ్రి, కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను చూశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. ప్రిన్సిపాల్ గట్టయ్య ఉన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన

- ఎంఈఓ దేవానాయక్


మాట్లాడుతున్న ఎంఈఓ దేవానాయక్

భూపాలపల్లి అర్బన్ : ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి దేవానాయక్ కోరారు. మండలంలోని కొంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ టీవీ, లైబ్రరీని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల సౌకర్యానికి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా టీవీ, లైబ్రరీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ, ఉపాధ్యాయులు అమరేందర్‌రెడ్డి, రమేష్, కమల్, రాజమణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు


మాట్లాడుతున్న కుమ్మరి రాజు

కాళేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు అన్నారు. మహదేవపూర్ మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన మావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు హాస్టల్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సకాలంలో బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. అలాగే కళాశాల ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష కార్యదర్శులుగా ఇబ్రహీం, నవదీప్, బాలికల కమిటీ కన్వీనర్ కో కన్వీనర్‌గా సుస్మిత, శ్రీవిద్యలను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ఎస్ఎస్ తాడ్వాయి: పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన మేడారం జాతర చైర్మన్ అర్రెం లచ్చుపటేల్ తల్లి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మంత్రి సీతక్క గురువారం పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, వెంకన్న, ఎనగంటి నరేష్, రవికుమార్, సాయిరెడ్డి ఉన్నారు.

జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పరామర్శ

కొండపర్తికి చెందిన లచ్చుపటేల్ తల్లి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, అరుణ, బాబురావు, మోహన్‌రావు, రమేష్, పత్తిగోపాల్‌రెడ్డి, రఫీక్, కృష్ణ ఉన్నారు.

ములుగు రూరల్: మండల పరిధిలోని ఖాసిందేవిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వేలూరి మహేందర్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి గురువారం పరామర్శించారు. భిక్షపతి, అకుతోట చంద్రమౌళి, స్వామిరావు, శ్రీనివాస రెడ్డి, మురళి, సత్యం, హుస్సేన్ ఉన్నారు.

అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి


మంగపేట: బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు


వెంకటాపురం(కె)లో..


వాజేడు: కృష్ణాపురం వద్ద..


వాజేడు: కారును తనిఖీ చేస్తున్న వాజేడు ఎస్సై జక్కుల సతీశ్, పోలీసులు

- ఎస్సై కొప్పుల తిరుపతిరావు

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులతో ప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొప్పుల తిరుపతి రావు అన్నారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి గురువారం మండల పరిధిలోని నూగూరు గ్రామ శివారుల్లో వాహన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైన కనిపిస్తే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. పీఎస్సై సాయికృష్ణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని కృష్ణాపురం వద్ద రహదారిపై పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు అందులో తరలిస్తున్న వస్తువులను తనిఖీ చేశారు.

గుమ్మడిదొడ్డి క్రాస్ వద్ద..

మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి క్రాస్ వద్ద తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై ఎస్సై జక్కుల సతీశ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాలు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలను చోటు చేసుకోకుండా చూస్తున్నారు. కల్వర్టులు, బ్రిడ్జీలను తనిఖీ చేయడంతో పాటు మావోల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు.

మంగపేట: మండలకేంద్రంలోని కోమటిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రోడ్డుపై ఎస్సై టీవీఆర్ సూరీ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, ప్రైవేట్ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తు అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి పూర్తి సమాచారాన్ని తెలుసుకుని వదిలేస్తున్నారు.

ఏటీసీతో ఉజ్వల భవిష్యత్


ఏటీసీలో చేపట్టిన పనులు


ఏటీసీ కోసం వచ్చిన సామగ్రి

- అడ్వాన్స్ టెక్నాలజీతో మెరుగైన విద్య
- వాజేడులో శరవేగంగా నిర్మాణ పనులు



ఏటీసీ నూతన భవనం

వాజేడు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పారిశ్రామిక శిక్షణ రంగంలో సైతం మార్పులు చోటు చేసుకుంటున్నాయి. విద్యార్థులు టెక్నాలజీ పరంగా ముందుకు వెళ్తే భవిష్యత్‌లో ఎంతో ఎత్తుకు ఎదగవచ్చనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఐటీఐలతో పాటు ఏటీసీ(అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)లను తీసుకువచ్చింది. మరో ఆరు గ్రూపులు ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఇండస్ట్రీలలో ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనే ఈ ఏటీసీలను ప్రారంభిస్తున్నట్లు తెలుస్తుంది. దేశీయంగా ఇండస్ట్రియల్ ట్రేడింగ్ ఇనిస్టిట్యూట్ ఫాస్ట్ టెక్నాలజీలు రాగా ప్రస్తుతం ఇండస్ట్రియల్ 4.0 సాఫ్ట్‌వేర్ వచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్‌తోనే మిషనరీ తయారీ జరుగనుంది. అందుకు అనుగుణంగా ఏటీసీ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. 100 సంవత్సరాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త కోర్సులను తీసుకువస్తున్నట్లు తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో 65 ఐటీఐ కళాశాలల్లో 25 కళాశాలలను ఏటీసీ కళాశాలలుగా మార్పు చేయగా అందులో వాజేడు ఐటీఐ కళాశాల కూడా ఉంది. 50 సంవత్సరాల టెక్నాలజీ కంటే ఇప్పుడు తీసుకువచ్చిన టెక్నాలజీ కోర్సులు 50 ఏళ్లకు సమానంగా తీసుకువచ్చినట్లు సమాచారం. ఏజెన్సీ మండలమైన వాజేడులో నూతనంగా ఏటీసీ సెంటర్‌ను ప్రారంభించగా టాటా సహకారంతో శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శిక్షణా కేంద్రంలో మిషనరీ పనులు చేపట్టారు.

కొత్తగా ఆరు కోర్సులు

ఐటీఐలో ఉన్న గ్రూపులతో పాటు నూతనంగా ప్రారంభించిన ఏటీసీ శిక్షణా కేంద్రంలో కొత్తగా మరో ఆరు గ్రూపులను ప్రవేశపెట్టారు. ఈ గ్రూపులలో కోర్సులను పూర్తి చేస్తే ఉపాధి పొందే అవకాశం ఎక్కువగా ఉంటాయి. ఏజెన్సీ విద్యార్థులకు ఇది ఒక మహర్దశగా చెప్పవచ్చు. దేశీయంగానే కాక అంతర్జాతీయంగా కూడా ఉద్యోగాలను పొందే అవకాశం ఉంటుంది. రెండు సంవత్సరాల కోర్సులతో పాటు ఒక సంవత్సరం కోర్సులు సైతం ఉన్నాయి. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, మెషన్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులు రెండేళ్ల పాటు ఉండనుండగా ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, మన్యూఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మన్యూఫ్యాక్చరింగ్ కోర్సులు ఒక ఏడాదిలో పూర్తవుతాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చు.

దరఖాస్తులు చేసుకోండి



“ ఏటీసీలో చేరడం కోసం పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి. ఏజెన్సీలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

– శేఖర్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు పంపిణీ చేస్తున్న శరత్‌చంద్ర

మొగుళ్లపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. గురువారం ముల్కలపల్లిలో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు పెంచితేనే మానవ మనుగడ సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.